# వర్ణమాల

## రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు

సాంబమూర్తిగారు నించున్న క్యూ ఏమాత్రం తరగలేదు ఎందుకొచ్చినట్టు ఇక్కడికి? అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

ఎక్కడికి బయల్దేరాడు? ఎక్కడ చిక్కడ్డాడు?

"దీం దుంపతెగ. ఈ జీవితం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. ఏదో చూపించి మరేదో చేతిలో పెడుతుంది, మన ఇష్టాయిష్టాల ప్రసక్తి లేకుండా" విసుక్కున్నాడు సుబ్రహ్మణ్యం

*　　*　　*　　*　　*

ఎడారిలాగా అనంతంగా పరుచుకున్న నిస్సారమైన జీవితంలో ఇరవై తొమ్మిదేళ్ళుగా ప్రయాణిస్తున్న సుబ్రహ్మణ్యం ఒక రకమైన విరక్తి పెంచుకుంటున్న రోజుల్లో నీటితావులాగా ఒక అవకాశం తారసిల్లింది.

ఉత్సాహం మొలకెత్తింది.

ఏ పుట్టలో ఏ పాముందో?

ప్రయత్నించి చూడాలి. ఏమో ఒక్కమాట చెబితే, నా రోజు బాగుంటే, ఈ ఉద్యోగం నాకే రావచ్చు.

ఎంత చిన్నదయినా, ఎంత తాత్కాలికమైనా ఒక ఉద్యోగం అవసరం అతనికిప్పుడు.

జీవితంలో పచ్చదనం కొంచెమైనా కనబడాలిప్పుడు. అంచేత తారసపడింది నీటితావో ఎండమావో తేలకపోయినా గుండెనిండా ఆశ నింపుకున్నాడు సుబ్రహ్మణ్యం.

మొలకెత్తిన ఉత్సాహం మానయ్యింది

'ఈవేళ సాయంత్రంలోగా గురుమూర్తిగారిని కలిసి తీరాలని సైకిలు తీశాడు.

"ఎక్కడికోయ్.... ఉహుఁ నేనూ టౌనుకేలే. పద ... మంచి కంపెని దొరికింది దూరం తెలియకుండా...." అంటూ అరుగుమీద నించి సైకిలు దించుకున్నారు ఎదురింటి సాంబమూర్తిగారు.

*　　*　　*　　*　　*

"ఊఁ ఏవిఁట్రా విశేషాలు?" అన్నాడు సుబ్రహ్మణ్యం సత్యనారాయణతో. అప్పటికా ప్రశ్న మూడో సారి

అడక్కంచేస్తాడు? ఏమి కాలక్షేపం కావటంలేదు. కరెంటు పోయిందేమో ఒకటే ఉక్కపోత.' ఊరికే నించుంటే విసుగు. అక్కడికి తన ముందు కౌంటర్లో కూచున్న నీలంచొక్కా "బొద్దుబాబు" పనిచేసే తీరుని పది నిముషాలపాటు పరిశీలించి చూశాడు. బేంకు అంతా సర్వే చేయడం అయిపోయింది ఉన్నచోటునే ఉండి.

ఏవున్నాయి? నువ్వే చెప్పాలి?" అన్నాడు సత్యనారాయణ రెండో సారి.

ఇద్దరికీ 'ఏవీఁ తోచని కబుర్లే కాబట్టి ఎవరూ నోరు విప్పలేదు.

"బొద్దుబాబు బావున్నాడు" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. "ఎలాగైనా బేంకువాళ్ళు బావుంటారు. వైటు కాల రుద్యోగాలు" అనుకున్నాడు మళ్ళీ.

కరెంటు వచ్చింది. ఫేన్లు పని మొదలెట్టాయి

"మహ చురుగ్గా పనిచేస్తున్నాడు వీడు. వంచిన తలెత్తకుండా మంచి ముండా వాళ్లా ఉన్నాడే" అనుకుంటున్న సుబ్రహ్మణ్యానికి బొద్దుబాబు టేబిలుమీదున్న కాగితం ఒకటి గాలికి ఎగిరి కిందపడటం కనిపించింది. అది పక్కనున్న సత్యనారాయణ చూశాడు

ఇలాంటివి చూసినప్పుడు సాధారణంగా నోరూరుకోదు. సత్యనారాయణ నోరు ఊరుకోలేదు.

"కాయితం ఒకటి ఎగిరి కింద పడిందండీ" అన్నాడు.

బొద్దుబాబులో చలనంలేదు. విన్నాడో లేదో కూడాను. రాస్తూనే ఉన్నాడు.

సుబ్రహ్మణ్యం సాంబమూర్తిగారి కేసి చూశాడు క్యూ తరుగుతోంది. ఇంక ముగ్గురు.... ఇద్దరు.... ఒక్కరే....

బొద్దుబాబు చేస్తున్న పని ముగిసినట్టుంది. కాగితాలు దొంతరచేస్తూ అటూ ఇటూ వెతుకుతున్నాడు టేబిలుమీద.

"నాకేం సంబంధం? ఏమాత్రం లేదుగాక లేదు" అనుకోలేకపోయాడు సుబ్రహ్మణ్యం ఆ జాతి మనుష్యులు అలా అనుకోరు.

"కాయితం కోసమేనా? అది ఇందాక ఎగిరి కింద పడిందండీ" అన్నాడు.

బొద్దుబాబు తలెత్తాడు. బాబు మొహం చిరాగ్గా ఉంది. పదిమంది ముందు పైవాడిచేత అక్షమైన చివాట్లు తిన్న ఆఫీసరు ప్యూన్‌ని చూసినట్టు చూసి....

"డోన్టాక్. మైండ్ యువర్ బిజినెస్" అన్నాడు చిరాగ్గా! బిగ్గరగా.

సుబ్రహ్మణ్యం ఆశ్చర్యపోయాడు.

"డోన్టాక్! మైండ్ యువర్ బిజినెస్" అనే అన్నాడా? ఇంత గట్టిగానూ!

ఇటు క్యూలో ఉన్నవాళ్లూ, సత్యనారాయణా, పక్కనేఉన్న సుబ్రహ్మణ్యానికి తెలిసిన ఒక షావుకారూ ఏవిఁటేవిటన్నట్టు చూశారు.

ఆశ్చర్యం రంగుమారి కోపం అయింది

ఛర్రున మండింది సుబ్రహ్మణ్యానికి. పుణ్యానికి చెబితే డోన్టాక్ అంటాడా? మేనర్లెస్ ఫెలో.

పొగరన్నమాట వీడికి.

"నామీద వీడి అథార్టీ ఏమిటి? బోడి వెధవ" అనుకున్నాడు. తిక్క కోపం రేగింది. "తుక్కు రేగ్గొట్టాలి రాస్కెల్‌ని!"

అనుకోవడానికి పట్టిన సమయం తక్కువేగాని ఇవన్నీ అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. ఇవేకాదు అంతకన్న తీవ్రమైనవి మరికొన్ని కూడా క్షణంలో సగంలో అనేసుకున్నాడు. కంపించిపోయాడు.

"ఐనో వాట్ మై బిజినెస్ ఈజ్. సాటి మనిషిగా ఊరుకోలేక చెప్పాను... బుద్ధి గడ్డి తిని. నీ కాయితంపోతే ఎవడికి నీ ఉద్యోగం ఊడితే ఎవరికిరా...."

"రా" అన్నాడు. అనేశాడు. నోరు జారింది మాట.

బొద్దుబాబు మొహం కందగడ్డ అయిపోయింది,

"వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్.... రా ఏవిఁట్రా? మర్యాదిచ్చి మర్యాద పుచ్చుకో" అన్నాడు. కాదు అరిచాడు.

"నీకా మర్యాద? మేనర్లెస్ స్టుపిడ్" సుబ్రహ్మణ్యం.

"యూ... సనాఫే బిచ్ ఘెటౌట్" ఉగ్రుడైపోయాడు బొద్దుబాబు.

మనిషి ఊగిపోతూ కుర్చీని కాలితో వెనక్కు తన్నాడు.

"గెటవుటా? ఘెటౌట్!!! ఒళ్ళు వేడెక్కిపోయింది సుబ్రహ్మణ్యానికి.

"గెటౌటా? బేంకు నీ తాతగారి సొమ్మనుకున్నావురా? నీ బతుకమ్మేస్తే నా ఎడంకాలి చెప్పు విలువ చెయ్యదోరేయ్! కస్టమర్‌కే సర్వెంటువిరా నువ్వు.... నే తల్చుకుంటే... "

బొద్దుబాబు సుబ్రహ్మణ్యాన్ని ఏవీఁ అట్టేపెట్టలేదు. పొద్దుట ఇంటి దగ్గరైన ఘర్షణా, గంట ముందు మేనేజర్ పెట్టిన చివాట్లూ ఒక్కసారి భగ్గుమన్నాయి లోపల.

ఇద్దరూ అరుచుకున్నారు. చెడీ అంటే ఫెడీ అనుకున్నారు. భాష సభ్యస్థాయినించి దిగజారింది. ఒళ్ళు మరిచి మాటలే ఈటెలుగా విసిరేసుకుంటున్నారు.

క్షణాలమీద తుఫానులా రేగిపోయింది వాగ్వివాదం.

బేంకులో పనంతా స్తంభించిపోయింది. కొందరు నిర్ఘాంతపోయారు. కొందరు ముచ్చటగా ఒళ్లంతా కళ్ళు చేసుకుని, మెదడంతా చెవులు చేసుకుని వింటున్నారు. కొందరు ఏమైందేవైఁందని పక్కవాళ్ల భౌతిక చెవులు తినేస్తున్నారు, ఒక చెవి ఇటే ఉంచి.

సాంబమూర్తిగారు సుబ్రహ్మణ్యం దగ్గర కొచ్చారు, హడావిడిగా.సత్యనారాయణకి, తదితర ప్రేక్షకులికీ ఈ సంఘటన కలేమో అన్పించింది. ఎలా మొదలై ఎలా పరిణమించిందని నిశ్చేష్టులయ్యారు.

ఏవిఁటేవిఁటని బేంకు వాళ్ళు బొద్దుబాబును చుట్టేశారు.

అద్దాలకు ఇవతలున్నవాళ్ళు సుబ్రహ్మణ్యాన్ని

చుట్టుముట్టేశారు. "ఏవిఁటేవైందెలాఐంది మేష్టారూ?" అని.

చెవుల్లోంచి పొగలొస్తుంటే మాటలు వినబడవు.

ఊరుకోండి. ఊరుకోండి అన్నారు వాళ్ళూ వీళ్ళూ, అతన్నీ ఇతన్నీను.

గుండె దహించుకుపోతుంటే హితబోధలు పని చెయ్యవు.

లాభంలేదని దూరంగా లాగి పారేశారు ఇద్దర్నీను.

బేంకు మేనేజరొచ్చి "ఏమిటి మేష్టారూ?" అనడిగాడు పెద్దమనిషి తరహాలో.

సుబ్రహ్మణ్యం చెప్పాడు. మేనేజరు మాట్లాడలేదు. దాంతో మళ్ళీ చిర్రెత్తింది సుబ్రహ్మణ్యానికి.

"వాళ్ళూ.... వాళ్ళూ ఒకటంది తప్పూ ఒప్పూ ఎవరిక్కావాలి? నాకుపట్టుకున్నదేవిఁటంటే...."

వాగ్ప్రవాహం మళ్ళీ కట్టలు తెంచుకుంటోంది.

అంతవరకూ శ్రోతలా నించున్న సత్యనారాయణ "ఊరుకోరా సుబ్రహ్మణ్యం" అన్నాడు.

"ఏవిఁట్రా ఊరుకోనేది? నేనన్న మాటలో తప్పేవిఁట్రా? ముందునించీ అంతా చూసిన వాడివి మావాడి మాటలో తప్పేవిఁటని ఒక్క మాటనలేకపోయావు. యూస్‌లెస్‌ఫెలో."

కోపానికి అర్థం ఉండదు.

సాంబమూర్తిగారు ఇది పనికాదని సుబ్రహ్మణ్యాన్ని బయటకు లాక్కుపోయారు. "కాఫీ తాగుదాం" అని హోటలుకి దారి తీశారు.

బొద్దుబాబు ఆయాసపడుతూ మహా పిరుల్లా ఏవో ప్రగల్భాలు పలుకుతూనే ఉన్నాడు అక్కించి.

సాంబమూర్తిగారు చెప్పిన మాటలన్నీ విన్నాడు సుబ్రహ్మణ్యం. చాలా మాటలు మెదడు కెక్కలేదు. ఓ పావుగంటయ్యాక సుబ్రహ్మణ్యాన్ని వల్లె బరిపాసనుకొని వెళ్ళిపోయారు సాంబమూర్తిగారు.

* * * * *

సైకిలెక్కి ముందుకు కదిలాడు సుబ్రహ్మణ్యం. గురుమూర్తిగారిని కలిసే మూడ్ లేదిప్పుడు. ఆయన్ని కలవడంకన్నా ముఖ్య విషయం అయి కూర్చుంది బొద్దుబాబుతో ఘర్షణ.

మాటిమాటికీ జరిగిపోయిన ఆశ్చర్యకర సంఘటనే గుర్తొస్తోంది.


దుర్మార్గుడు. ఎంత పొగరుగా మాట్లాడాడు! కావరం!! కళ్ళు మూసుకుపోయి ఏడుస్తున్నాడు ఎన్నెన్ని కూతలు కూశాడు!!

లాగి లెంపకాయ కొట్టాల్సింది. గూబ గుయ్యిమనేటట్టు. ఎంతమందెంత మంది చూశారు! ఎంత అవమానం!!

జుట్టు పట్టుకుని ముక్కుమీద గుద్దాల్సింది రక్తం కారేటట్టు. నేనన్న మాటలో తప్పేవిఁటి? ఎక్కడ తప్పు? ఏమిటి తప్పు??

కాయితం పడిపోయిందండీ అన్నాడు.

అంటే "డోన్టాక్" అని మొదలెడతాడా? ఇంత



ఈ పరిణామానికి సత్యనారాయణ అవాక్కయిపోయాడు. ఆ మాటకొస్తే తన మాటలికి తనే నిర్ఘాంతపోయిఉండాలి సుబ్రహ్మణ్యం.

వాళ్ళిద్దరి పరిచయం అంతంత మాత్రమే. ఒకప్పుడెప్పుడో క్లాసుమేటు. అంతస్తులమధ్య అనంతదూరం ఉంది.

ఒళ్ళు కొవ్వెక్కినవాడిని క్షమించకూడదు. అది మానవజాతికే ద్రోహం చెయ్యడం. కాలో చెయ్యో తీసెయ్యాలి.

తీసితీరాలి.


"ఘురౌర్.... సనాఫేబిచ్.... ఈడ్ని తంతే దిక్కులేదురా...." బొద్దుబాబు మాటలన్నీ చెవుల్లో మార్మోగుతున్నాయి.

పీక్కి కొట్టాలి జవ్వాళ.

## బాంబినో ఉప్మా

2 కప్పుల బాంబినో వెర్మిసెల్లి
2 చెంచాల నూనె
1 తరిగిన ఎర్రమిరపకాయ
1/4 చెంచా ఆవాలు
నిమ్మరసం
4 కప్పుల నీళ్ళు
1 కొత్తిమీర కట్ట

ముందుగా బాంబినోను నూనెలో వేయించి వేరే పెట్టాలి. ఆ వేయించిన మూకుడులో నే ఆవాలు వేసి చిట్లే వరకు చూసి, మిరపకాయలు, ఉల్లిపాయ ముక్కలు వదేయాలి. 2 నిమిషాలు వేగిన తర్వాత నీళ్ళు కలపాలి. నీళ్ళు మరగ్గానే వేరే ఉంచిన బాంబినోను మూకుడులో వెయ్యాలి. నిమ్మ రసం పోసి, కొత్తిమీర కట్టను ముక్కలుగా తరిగి తయారయిన ఉప్మా మీద అందంగా చల్లాలి.



## వర్ణమాల

ఏదో చెయ్యనిదానికి పైగా సహాయం చెయ్యబోయిన దానికి ఇదా సత్కారం?

కొట్టితీర్తాను ఏమైనా సరే!

ఆ నిర్ణయం తీసుకున్నాక వేడెక్కిన ఒళ్ళు చెమటలు కక్కటం మొదలుపెట్టింది.

సైకిలు చాలా జోరుగా పోతోంది.. ఎటో..... ఏమో.... దారి పట్టలేదు సుబ్రహ్మణ్యానికి. కసి. అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలి. ఆ తలపొగరుకి దెబ్బకొట్టాలి. కొట్టి తీరాలి. అంతే.

దెబ్బ కొట్టడం ఏమిటి? ప్రాణం తీసెయ్యాలి. ఓ రాయి తీసుకుంటే చాలు. చుట్టూ చూశాడు. సగం విరిగిపడిన మైలు రాయి కనిపించింది అంత దూరాన....

రైట్.... ఇదిచాలు. ఇలాంటిది చాలు. ఒకే దెబ్బ. తర్వాతేమయినా సరే.జైలుకి పోయినా, యావజ్జీవం పడిపోయినా సరే.

ఇలాంటి దుర్మార్గుణ్ణి వదిలి లోకద్రోహం చెయ్య కూడదు. ఉరి తీసినాసరే.... ఉరి.... ఒక్క క్షణంలో దిగులు కమ్మింది గుండెల్లో. తనను ఉరితీసే దృశ్యం ఊహల్లో కదిలింది. గొంతు చుట్టూ-నల్లని గుడ్డమీద బిగుసుకుంటున్న తాడు.... కళ్ళు చెమ్మగిల్లాయి.

తన భార్యా బిడ్డలూ....

ఏమైనాసరే. వాణ్ణి వదలకూడదు.

కోపానికి కళ్ళు లేవు. మనసులేదు. మెదడులేదు. అదంతే. ఇదంతా ఎందుకు జరిగింది అన్న ప్రశ్న మెదడు లోలోపలి పొరల్లోనే ఉండిపోయింది. చిన్న విషయానికి ఇంత రాద్ధాంతం ఎలా అయ్యింది అన్న ప్రశ్నని కోపం కమ్మేసింది. ఫలితాలూ పర్యవసానాలూ తుది మొదలూ ఏవీ వద్దు దెబ్బకొట్టాలి.

ఇప్పుడే కొడితే.... యస్! ఎందుకొట్టరాదు! అంతమంది ముందూ.... తనని అవమానించగా చూసిన వాళ్ళందరిముందూ.... చాచి ఒక చెంపదెబ్బ.... చాలు.

సైకిలు గిర్రున వెనక్కి తిరిగింది. వేగం పెరిగింది. మనస్సూ, దేహం, సర్వం ఆయత్తమై ఉరకలేస్తూ బేంకు చేరాయి.

స్టాండు వేసి.... కోపం రూపంలా బేంకులో అడుగుపెట్టాడు.

బొద్దుబాబున్న కౌంటర్‌కి ఎదురుగా బెంచిమీద కూర్చున్నాడు.

అటో... యిటో ... చెటాపట్....

ఏదైనా ఒక వంక కావాలి. ఒక వంక.

క్షణాలు నిమిషాలయ్యాయి. నిమిషాలు పదిహేను గడిచాయి.

బొద్దుబాబు కళ్ళూ సుబ్రహ్మణ్యం కళ్ళూ రెండు కలిశాయి.

ఆ వేగం! స్పందన!!

బొద్దుబాబు తల దించేశాడు. మళ్ళీ తలెత్తలేదు.

కూర్చుని కూర్చుని విసుగెత్తింది సుబ్రహ్మణ్యానికి.

సరే! ఇంక దొరకదా? బైటికిరాడా?

పిరికి వెధవ!

సైకిలు దగ్గరికి నడిచాడు.

* * * * *

రాత్రి తొమ్మిది దాటింది.

మసక వెన్నెట్లో నెమ్మదిగా సాగిపోతోంది సుబ్రహ్మణ్యం వాహనం. వెళ్ళిన పని కాలేదు. తను వెళ్ళడానికి అరగంట ముందు తనకి కావాల్సిన వ్యక్తి ఊరెళ్ళిపోయాడు.

వేరే ఏవో ప్రయత్నాలుచేసి చేసి అలసిపోయాడతను. అవి ఫలించేటట్టూ లేవు. ఫలించినట్టూ లేవు.

ఉండుండి బొద్దుబాబుమీద కోపంతో మనసు మరిగిపోయేది. "వీడిమూలానేకదా అరగంట ఆలీసం అయింది" పళ్ళు కొరుక్కున్నాడు సుబ్రహ్మణ్యం.

"నేనుట్టి సన్యాసిని" అనుకున్నాడు.

మరే. కాకపోతే ఏవి(టిది? సాంబమూర్తిగారు రమ్మన్నంతమాత్రాన నా పని వదిలిపెట్టి అటే పోవడమేవి(టి? ఒక్కమాట అడ్డు వేస్తే ఇంత రభస కాకపోను. ఇటు పనీ అయిపోను.

ఆ వెధవని తన్నలేకపోయాను. ఒక్క దెబ్బ.... ఒక్కటయినా కొట్టలేకపోయాను.

వెళ్ళిన పని చేసుకురాలేకపోయాను. ఎంత ముఖ్యమైన పని! ఉద్యోగ సమస్య! జీవితంలో అతి ముఖ్యమైన పనుల్లో ఒకటి. రెండు రోజులే గడువుందిట. అటు కావలసినవాడు చేజారిపోయాడు.

మళ్ళీ ఎన్నాళ్ళకో.... ఇంకో ఛాన్సు.

సుబ్రహ్మణ్యానికి తన వైఫల్యాలు.... ఎప్పటెప్పటివో ... అనేకానేకాలు గుర్తుకు రాసాగాయి. అతనికి గుండెల్లో దిగులు పుట్టింది. గుండెకాయని ఎవరో చేత్తో కదిపినట్టయ్యింది.

ఉద్యోగంలేని, ఇల్లు సౌకర్యంగా ఉంచలేని, ఎవర్నీ సంతోష పెట్టలేని, వెనక ఏమీ ఆధారంలేని అతి సామాన్యుడు తను.

చుట్టూ పరుచుకున్న మసక చీకటిలో, తోడెవ్వరూ లేని సుబ్రహ్మణ్యం, జీవితంలో కూడా ఒకళికొకగా ఫీలయ్యాడు, ఆక్షణాన.

ఒంటరి! నిస్సహాయుడు!! అనాథ!!!

ఇరవై తొమ్మిదేళ్ల జీవితంలో ఏమీ సాధించలేకపోయిన అ...స...మ...ర్థు...డు.

మొహాన్ని విషాదం ఆవరించుకుంది. కళ్ళు ఆర్ద్రాలయ్యాయి. అంత చల్లటి వాతావరణంలోనూ ఉక్కపోసినట్టయిందతనికి.

ఒకడికి 'చేతనైనంతవరకూ మంచే చేశానుగాని అపకారం చెయ్యలేదే? నా కెందుకు ఇలా ఉంది బ్రతుకు... వెలిసిపోయిన బట్టలా.... చివికిపోయిన తోలులా...

అలాంటి నన్ను ఒక బోడివెధవ అకారణంగా తిట్టాడు, పదిమంది ముందు.

ఒక్కడూ ఇది తప్పన్న పాపాన పోలేదు. ఆ షావుకారు చూశాడు మొదట్నుంచీ, చెప్పొచ్చుకదూ? పైగా ఒకే ఊరివాళ్ళం. వాడు ఆ నల్ల కళ్ళద్దాలవాడూ చూశాడు. సత్యనారాయణమటుకు!

జనాభా సమస్యతో తల్లకిందులైపోతున్న ఈ భూమ్మీద నిజమైన మనిషి ఒక్కడూ లేడు.
ఔదాసీన్యం, సాటివాడికి అన్యాయం జరిగినా పట్టదు. ఎవడిదారి వాడిదే. వీళ్ళంతా ఎవరూ ఎవరికి ఏమీ కారు.

మనుష్యుల్లా ఉంటారు అంతే.

ఏం చేసినా మనమే చేసుకోవాలి. అందుకే.... బోడ్డుబాబుని నేనే... స్వయంగా ఒక్క దెబ్బ కొట్టాలి. ఒక్క తన్ను...

నిస్సహాయతలోంచి, బాధలోంచి, దిగుల్లోంచి, బెంగలోంచి తృప్తి కోసం పుట్టిన ప్రతీకారవాంఛ అది.

సాయంత్రంఅంతా అతన్ని మండించి మండించి శక్తి అంతా పీల్చి పిప్పిచేసి క్రోధం ఒక కెరటంలా పొంగింది గుండెల్లో.

కీ....కీ... స్కూటరు హారన్!.... వెనక.

డాష్ ...ఢిం ..క్రిం...కిర్....

ఏక్సిడెంటు!!!

వెనక్కి తిరిగిచూశాడు సుబ్రహ్మణ్యం. ఒక సైకిలుని గుద్దుకొంది స్కూటర్. సైకిలు చర్‌మని రోడ్డుమీద ఒరిగిపోయి ఒక పక్కకు ఈడ్చుకుపోయింది. సైకిలుమీద ఉన్న వ్యక్తి రోడ్డు పక్క నున్న మైలురాయిమీద పడ్డాడు.

"అహ్....మ్మా" గుండె పిండే మూలుగులాంటి కేక అది. దెబ్బ తిన్న అభాగ్యుడి ఆర్తనాదం.

స్కూటర్‌వాలాకి దెబ్బ తగిలినట్టు లేదు. అసలు బేలన్సే తప్పలేదు. అయోమయస్థితి నుంచి ఒక్క క్షణంలో తేరుకున్నాడు అతను. సర్రున దూసుకుపోయాడు ముందుకు

"మనిషి ఎంత స్వార్థపరుడు!!" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. స్కూటర్‌వాడిమీద పట్టరానంత కోపం వచ్చింది. ఏక్సిడెంటు కావడం పొరపాటు కావచ్చు. దెబ్బతిన్న సాటి మనిషిని వదిలిపెట్టిపోవడం నీచం.

సైకిలుస్టాండు వేసి దెబ్బతిన్న వ్యక్తిని లేవదీయడానికి వెనక్కు పరుగెత్తాడు.

"చెయ్యి.... చెయ్యి...." అని మూలిగా డతను.

చక్రంలో ఇరుక్కుపోయిన చేతిని చూశాడు సుబ్రహ్మణ్యం. నెమ్మదిగా విడిపించాడు. అవతల వ్యక్తి సంగతేమోగానీ సుబ్రహ్మణ్యం ప్రాణం గిలగిలలాడిపోయింది. ఎక్కడ నొప్పి కలుగుతుందో అని.... విడిపించే సమయాన.

అతని మోకాలిమీద పడింది సుబ్రహ్మణ్యం దృష్టి. మైలు రాయి దెబ్బకి కాలు చిట్లింది. ఆ మసక చీకట్లో రక్తపు చుక్కలు నల్లగా.... నల్లని రక్తం.... రోడ్డుమీద, కాలిమీద.

"అరరే.... ఎముక చిట్లిందో ఏమో...' అని అనుకుంటూ, ఫైకంటూ... తొందరగా జేబురుమాలు తీసి కట్టు కట్టాడు.

అవతలి వ్యక్తి కింకా తిమ్మిరి వదిలినట్టు లేదు. మూలుగు అయోమయంగా సుబ్రహ్మణ్యం కదలికలు చూస్తున్నాయి. మోకాళ్ళూ వీపూ.... చేతులూ పరిశీలించాడు సుబ్రహ్మణ్యం. ఇంక దెబ్బలేమీ ఉన్నట్టులేవు.

ఏవేవో ప్రశ్నలూ.... జవాబులూ....

సైకిలు నిలబెట్టాడు. 'ఒక్కక్షణం కుదురుకోండి' అని అతన్ని మైలు రాయికి చేర్చి కూర్చోబెట్టాడు.

'అలవాటుందా?' అని అడుగుతూ సిగరెట్టొకటి యిచ్చి వెలిగించాడు, తనొకటి ముట్టించుకొని.

ఉదయపు ఉత్సాహంగానీ, మధ్యాహ్నపు కోపంగానీ, సాయంత్రపు దిగులు కానీ లేవిప్పుడు అతని మనస్సులో. భిన్న భిన్న వర్ణాల ఉద్వేగాలు కరిగి, కలిసి, తెల్లగా, అఖండంగా, శాంతంగా వెలిగే మానవత తలెత్తింది.

అతని మనసునిండా ఆర్ద్రత పొంగి పొరలుతోంది. మానవుణ్ణి, మానవుణ్ణి దగ్గర చేర్చి బంధించిఉంచే మానవతా గుణం ఆ క్షణాన సుబ్రహ్మణ్యం గుండెల్ని కదిలించి వేసింది.

శరీరం తూలికలా తేలికైపోయింది.

తన సైకిలు అడ్డుకర్రమీద ఆ వ్యక్తిని కూర్చోబెట్టుకుని, ఒక చేత్తో అతని సైకిలు పట్టుకుని, రెండో చేత తన సైకిలు అదుపులో పెడుతున్నాడు సుబ్రహ్మణ్యం.

సైకిళ్ళు భారంగా కదులుతున్నాయి.


సుబ్రహ్మణ్యం మనసు మూలల్లో ఉదయించిన కరుణ ఇంతై ఇంతింతై గుండెనిండి, గొంతును గద్గదికం చేసి, కళ్ళలోకి పొంగింది.

జీవితం అంటే ఏమిటో దాని నడక ఎలా ఉంటుందో దాని హాయి ఏమిటో అర్థమయినట్టు అనిపించింది అతనికి.

ముందు కూర్చున్న బోడ్డుబాబు కళ్ళ వెంట ధారాపాతంగా కారే అశ్రువుల్ని చూడలేదతను.

చూస్తే, అవి గాయాలవల్ల జారిన బాష్పకణాలని అపోహ పడతాడో .... ఏమో.... □

## ఇ·వేమన·పద్యాలు




మాటలాడు టొకటి మనసులో నొక్కటి
యొడలి గుణము వేఱె యోజవేఱె
యెట్లుగలుగు ముక్తి యీలాగుగా నుండ
విశ్వదాభిరామ వినురవేమ.